క్లుప్తంగా

శ్రీకృష్ణలీలలు నృత్య రూపకం ప్రదర్శన



నృత్యరూపకంలో పాల్గొన్న విద్యార్థినులు

సీతంపేట: ఇటీవల తిరుమలలో జరిగిన సాలకట్ల బ్రహ్మోత్సవాలలో నగరానికి చెందిన నృత్య భారతి డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకులు వి.మౌనిక పట్నాయక్ ఆధ్వర్యంలో 30 మంది విద్యార్థులు శ్రీకృష్ణ లీలలు నృత్యరూపకం ప్రదర్శించారు. దేవస్థానం అధికారులు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మౌనిక మాట్లాడుతూ శ్రీవారి సన్నిధిలో నృత్య రూపకం ప్రదర్శించడం వేంకటేశ్వరస్వామి ఇచ్చిన అదృష్టంగా భావిస్తున్నాని తెలిపారు. ఇంతటి అవకాశం ఇచ్చిన టీటీడీ అధికారులకు, అన్నమయ్య సేవా ట్రస్ట్‌కు ధన్యవాదాలు తెలిపారు.

నవరాత్రి ముగింపు సందర్భంగా అన్నదానం



భోజనాలు వడ్డిస్తున్న వరప్రసాద్ తదితరులు

మురళీనగర్: మురళీనగర్‌లో నిర్వహించిన దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాల ముగింపు అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పెద్దమ్మ తల్లి యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసంతర్పణ కార్యక్రమాన్ని మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్, నంబాల ఈశ్వరరావు పాల్గొని సుమారు 500 మందికి అన్నప్రసాదం అందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎ.కుమార్, ఎస్.సంతోష్ కుమార్, ఎస్.ప్రసన్నకుమార్, జి.లోకేశ్వరరావు, ఫిల్మ్ డైరెక్టర్ టి.రామకృష్ణ, ఎ.మణి పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

సీతమ్మధార: పాఠశాలలో ఉన్న పిల్లలకు క్యారేజీ పట్టుకెళ్తున్న ఒక మహిళ మెడలో గొలుసు చోరీ చేసిన ఉదంతమిది. నాలుగవ పట్టణ పోలీసులు తెలిపిసన వివరాలిలా ఉన్నాయి. రైల్వేన్యూకాలనీలో గల పాలాక్స్ స్కూల్లో చదువుతున్న పిల్లలకు స్థానికంగా నివాసం ఉంటున్న మహిళ కుమారి మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో క్యారేజీ పట్టుకెళ్తున్నారు. ఇంతలో వెనుక నుంచి ద్విచక్ర వాహనం మీద వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలో గల తులం బంగారు చైను తెంపుకెళ్లిపోయారు. చైను లాగేసిన క్రమంలో చైనులో గల వేంకటేశ్వర స్వామి లాకెట్ కింద పడిపోయింది. దీంతో ఆమె నాలుగవ పట్టణ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే క్రైం సీఐ రాజులునాయుడు, ఇతర పోలీసు అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి సీసీ ఫుటేజీలు పరిశీలించారు. ఈ కేసుని క్రైం సీఐ రాజులునాయుడు పర్యవేక్షణలో హెడ్‌కానిస్టేబుల్ సుభద్ర దర్యాప్తు చేస్తున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా

అంగన్‌వాడీ కేంద్రం

- మందుబాబుల చిందులు
- పరిసరాలు అధ్వానం
- ఇబ్బంది పడుతున్న సిబ్బంది, స్థానికులు

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం పరిధి జైప్రకాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రం అసాంఘిక కార్యకపాలకు అడ్డగా మారిందని స్థానికులు, సిబ్బంది వాపోతున్నారు. జీవీఎంసీ కమ్యూనిటీ హాల్లో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రభుత్వ పర్యవేక్షణలో నడుపుతున్నారు. చీకటి పడితే ఆకతాయిల అగడాలు మితిమీరుతున్నాయి. మందుబాబులు అంగన్‌వాడీ భవనంపై నిత్యం రాత్రిపూట చిందులు వేస్తున్నారు. వీధి లైట్లు ఆర్పేసి చీకట్లో మత్తు పదార్థాలు సేవిస్తున్నారు. దీంతో చీకటి పడితే అటుగా వెళ్లే కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికేతర యువత అంగన్‌వాడీ భవనాన్ని ఇలా మత్తు పదార్థాలు సేవించడానికి వినియోగిస్తుంటే స్థానిక యువత చెడు మార్గాన్ని అనుసరిస్తారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి తాగేసిన మందుసీసాలు, సిగరెట్ పీకలు అంగన్‌వాడీ కేంద్ర పరిసరాల్లో వదిలేయడంతో పరిసరాలు దుర్గంధభరితంగా మారుతున్నాయి. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. పారిశుధ్య సిబ్బందికి వాటిని తొలగించమని అడిగితే దురుసుగా సమాధానం చెబుతున్నారు.



జైప్రకాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్ర భవనం



అంగన్‌వాడీ కేంద్రానికి ఆనుకుని భవన నిర్మాణ సామగ్రి

అంగన్‌వాడీ పరిసరాలు దారుణం..

జైప్రకాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలు అధ్వానంగా మారాయి. మందుబాబులు వేసే వ్యర్థాలు సగమైతే స్థానిక బిల్డర్లు తమ కాంక్రీటు, డెక్కింగ్ సామగ్రితో అంగన్‌వాడీ కేంద్రాన్ని సొంత జాగీరులా వినియోగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లేందుకు మెట్ల మార్గం లేకపోవడంతో చిన్నారులు డ్రైనేజీ దాటి వెళ్లే పరిస్థితి నెలకొంది. ఒక్కోసారి చిన్నారులు జారి పడిన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని వారి తల్లులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



అంగన్‌వాడీ కేంద్రం మెట్ల మార్గంలో మందు సీసాలు, వ్యర్థాలు

మందుబాబులకు అడ్డుకట్ట వేయాలి

అంగన్‌వాడీ కేంద్రం మేడపై రాత్రిపూట మందుబాబులు అసాంఘిక కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు. చీకటి పడితే మహిళలు, ఆడపిల్లలు అటుగా రాకపోకలు సాగించాలంటేనే భయం వేస్తుంది. వారి చిందులకు అడ్డుకట్ట వేసేవాడు కనిపించడంలేదు. అడిగేవాడు లేకపోవడంతో ఆగడాలు మరీ శృతి మించిపోతున్నాయి.

– రామకృష్ణ, జైప్రకాష్‌నగర్

అధికారులు స్పందించాలి

అంగన్‌వాడీ పరిసరాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతున్నాయి. చీకటి పడితే అటు వెళ్లడానికి స్థానికులు భయందోళన చెందుతున్నారు. రాత్రి పూట పోలీసులు ఇటుగా విజిట్ చేస్తే పరిస్థితి కొంత మేర అదుపు చేయవచ్చు. సంబంధిత అధికారులు స్పందించాలి.

– కామేశ్వరరావు, జైప్రకాష్‌నగర్

అపారిశుధ్యం చెంత అన్నా క్యాంటీన్

సీతంపేట: స్థానిక రామాటాకీస్ రోడ్, బుల్లయ్య కళాశాల సమీపంలో ఉన్న అన్నా క్యాంటీన్ వద్ద నిత్యం అపరిశుభ్రత తాండవిస్తోంది. అన్నా క్యాంటీన్ పక్కనే ఉన్న సామాజిక మరుగుదొడ్ల ముందర డంపర్ బిన్ ఉంది. డంపర్ బిన్ చుట్టూ రోజూ పెద్ద ఎత్తున చెత్త పోగు పడి ఉంటోంది. చెత్త నుంచి వచ్చిన మురుగునీటితో ఆ ప్రాంతమంతా రోత పుట్టిస్తోంది. దీంతో ముక్కు మూసుకుని అన్నా క్యాంటీన్‌కు వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడిందని జనం వాపోతున్నారు. తిన్న తర్వాత ఆ దుర్వాసన మధ్య వాంతి అయ్యే విధంగా పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని జనం వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అన్నా క్యాంటీన్ వద్ద పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



రామాటాకీస్ రోడ్డులో అన్నా క్యాంటీన్ వద్ద అపరిశుభ్ర వాతావరణం

డిస్లెక్సియాపై అవగాహన ర్యాలీ

సీతంపేట: అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలో గల భవిత సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం డిస్లెక్సియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎంఈవోలు రామారావు, బాలామణి, భవిత టీచర్ జగదాంబ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లేఖనా వైకల్యం, పఠనా వైకల్యం, ఏకాగ్రత లోపం భాషణ వైకల్యం వంటివి డిస్లెక్సియా లక్షణాలు అని తెలిపారు. అటువంటి పిల్లలను గుర్తించి వారిని సాధారణ పిల్లలతో కలిపి అవసరమైన శిక్షణ ఇవ్వడం ద్వారా వారి సమస్యలను అధిగమించవచ్చన్నారు. డిస్లెక్సియాపై అవగాహనకల్పించడం ఈ అవగాహన ర్యాలీ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం లక్ష్మీనరస, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న భవిత సిబ్బంది

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో మంగళవారం గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలియజేసిన వివరాల ప్రకారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో శనివారం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఏఎస్ఐ ఎ. శివనారాయణ సిబ్బందితో కలిసి పలు ప్లాట్‌ఫాంలలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఒడిషా రాష్ట్రం, కోరాపుట్‌కు చెందిన త్రినాథ్ సీసా, అరుణ్ కంబార్‌ల లగేజీలను తనిఖీ చేయగా సుమారు రూ. 36,250 విలువైన 7.250 కేజీల గంజాయిని పట్టుకున్నారు. గంజాయిని సీజ్ చేసి, సదరు వ్యక్తులను జీఆర్పీ సిబ్బందికి అప్పగించారు. వీరిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో కలెక్టర్ తనిఖీ



పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్



పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్



అంగన్‌వాడీని పరిశీలిస్తున్న కలెక్టర్

యూపీహెచ్‌సీ సేవలపై ఆరా

సీతమ్మధార: గర్భిణులు, చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ అధికారులు, సిబ్బందిని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఆదేశించారు. స్థానిక రేసపువానిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారుల హాజరు శాతాన్ని, సరకుల నిల్వలను పరిశీలించారు. పిల్లల నేమ్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ క్రమంలో కాసేపు చిన్నారులతో ముచ్చటించారు. వారితో సరదాగా గడిపారు. తనిఖీలో భాగంగా నిర్వాహకులతో మాట్లాడిన ఆయన పలు అంశాలపై సూచనలు చేశారు. నెలవారీ సరకులు, టీహెచ్ఆర్, కేంద్రానికి వస్తున్న చిన్నారులకు అందిస్తున్న ఆహారం తదితర అంశాలపై నిర్వాహకులను ఆరా తీశారు. లోపాలు తలెత్తకుండా సరకులు అందజేయాలని, చిన్నారులు, గర్భిణులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని అక్కడి వారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త రాజ్యలక్ష్మి, ఆయా వున్నారు.

రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి..

ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం సేవలందించాలని, సకాలంలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ పేర్కొన్నారు. పాత రేసపువానిపాలెంలోని యూపీహెచ్‌సీని మంగళవారం ఉదయం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి పరిస్థితులను గమనించారు. ఓపీ సంఖ్య, అందుబాటులో ఉన్న మందుల వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో అక్కడికి విచ్చేసిన రోగులతో కలెక్టర్ మాట్లాడారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం అక్కడ పని చేస్తున్న ఉద్యోగుల హాజరు పుస్తకాలు, ఇతర రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆయన వెంట వైద్యాధికారి మన్మోహన్, సిబ్బంది ఉన్నారు.

ముగిసిన స్వచ్ఛతా పక్వాడా పక్షోత్సవాలు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలో ఈ నెల 1వ తేదీ నుండి ప్రారంభమైన స్వచ్ఛతా పక్వాడా పక్షోత్సవాలు మంగళవారంతో ముగిసాయి. వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ అక్టోబరు 1వ తేదీన స్వచ్ఛతా ప్రతిజ్ఞతో ప్రారంభించబడిన ఈ పక్షోత్సవాలలో భాగంగా పలు ప్రత్యేక కార్యక్రమాలను డివిజన్ పరిధిలో నిర్వహించారు. ముగింపు సందర్భంగా డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ మాట్లాడుతూ స్వచ్ఛతా కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని, ప్రతి ఒక్కరూ దీనిని ఆచరించినపుడు దేశాన్ని పరిశుభ్రంగా ఉంచగలమని తెలిపారు. భారతదేశ ప్రగతికి జీవనాడి అయిన భారతీయ రైల్వే భారతదేశాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో తన వంతు కృషి చేస్తుందని తెలిపారు. పక్షోత్సవాలలో భాగంగా డివిజన్ పరిధిలో గల ఆయా రైల్వే స్టేషన్లు, రైళ్లు, రైల్వే కాలనీలలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టారు. స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో పెద్ద ఎత్తున పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం నేతృత్వంలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ (ఈకార్వో) ప్రెసిడెంట్ మంజుశ్రీ ప్రసాద్‌బృందం, భారత్‌స్కౌట్స్ అండ్ గైడ్స్, సివిల్ డిఫెన్స్ వింగ్‌ల సహకారంతో అవగాహన కార్యక్రమాలు, లఘు నాటికలు, ఫ్లాష్ మాబ్స్, ర్యాలీల వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం గురించి అవగాహన కల్పించి ప్రత్యేక డ్రైవ్ ద్వారా 550 కేజీల ప్లాస్టిక్ బ్యాగ్స్, బాటిళ్ల వంటి ప్లాస్టిక్ వేస్ట్‌ను సేకరించారు. డివిజన్ పరిధిలో గల ప్రయాణికులకు క్లాత్ బ్యాగులు పంపిణీ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వీటిని అతిక్రమించిన వారిపై ఈ పక్షోత్సవాలలో 1356 కేసులు నమోదు చేసి, రూ. 3 లక్షల జరిమానా విధించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.



పరిసరాలను శుభ్రం చేస్తున్న డీఆర్ఎం, అధికారులు



విశాఖ రైల్వేస్టేషన్‌లో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఇన్‌చార్జి పాలనలో ఫోర్త్‌టౌన్ క్రైం స్టేషన్



ఖాళీగా ఉన్న ఫోర్త్‌టౌన్ క్రైం ఎస్ఐ సీటు

సీతమ్మధార: నగరంలోనే ఎంతో కీలకమైన నాలుగవ పట్టణ క్రైం పోలీసు స్టేషన్‌లో గత నెల రోజులుగా ఎస్ఐ పోస్టు ఖాళీగా వుండడం తీవ్ర దుమారం రేపుతోంది. ఈ స్టేషన్ పరిధిలో తరచూ పలు దొంగతనాలు జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ క్రైం ఎస్ఐగా పని చేసిన భాస్కరరావు సెప్టెంబర్ 15వ తేదీన పీఎం పాలెం స్టేషన్‌కి బదిలీపై వెళ్లిపోయారు. అంతవరకు బాగానే వుంది. అప్పటి నుంచి రెండో పట్టణ క్రైం ఎస్ఐ సునీల్‌కి ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. కాని ఆయన రెండు స్టేషన్ విధులతో సతమతం అవుతున్నారు. క్రైం విభాగంలో ఒక ఏఎస్ఐ, హెచ్‌సీలు నలుగురు ఉండగా, కానిస్టేబుళ్లు 14 మందికి గాను 10 మంది ఉన్నారు. పూర్తిస్థాయి ఎస్ఐ లేకపోవడంతో హెడ్ కానిస్టేబుల్ కేసులు కట్టాల్సిన దుస్థితి నెలకొందని స్టేషన్‌లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఫలితంగా వీరంతా పని ఒత్తిడితో సతమతం అవుతున్నారు. నమోదు చేసిన కేసులపై సైతం ఇన్‌చార్జి ఎస్ఐ సంతకాలు చేయకపోవడం తీవ్ర దుమారం రేపుతోంది. ఈ నెలలో ఇప్పటికే ఎనిమిది కేసులు నమోదు కావడం గమనార్హం. స్టేషన్ పరిధిలో దొండపర్తి, అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం, లలితానగర్, డైమండ్ పార్కు, రైల్వే న్యూకాలనీ, శ్రీనివాసనగర్ తదితర ప్రాంతాలు ఉన్నాయి. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు ఫోర్త్ టౌన్ క్రైం విభాగంలో ఎస్ఐ పోస్టుని భర్తీ చేయాలని పలువురు కోరుతున్నారు.

సొంత నిధులతోనే పోర్టు ఆస్పత్రి నిర్వహించాలి



రిలే నిరాహారదీక్షలలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం: పోర్టు ఆస్పత్రిని సొంత నిధులతోనే నిర్వహించాలని, ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం సరికాదని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. పోర్టు ఆస్పత్రిని పీపీపీ పద్ధతిలో ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వాలనే ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ పోర్టు ఆస్పత్రి వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు 15వ రోజుకు చేరాయి. మంగళవారం దీక్షలను సీఐటీయూ ఆలిండియా ఫెడరేషన్ కార్యదర్శి బి. జగన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ పోర్టు ట్రస్ట్ ఏర్పడి 50 ఏళ్లు అయిన సందర్భంగా పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రి ఏర్పడిందని, దీని ఏర్పాటుకు కార్మికులు రక్తాన్ని ధార పోసారని, కానీ కార్మికుల కష్టాలను మరిచి ఇప్పుడు దీనిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూడడం దారుణమన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి కార్పొరేట్లకు కట్టబెడుతుందని ఆరోపించారు. ఈ దీక్షలలో సీఐటీయూ నాయకులు కె. సత్యనారాయణ, జె. సత్యనారాయణ, బి. లక్ష్మణరావు, కెఎస్ కుమార్, శంకర్రావు, నాయుడు, రాఘవులు, శ్రీను, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో అబ్దుల్ కలాం జయంతి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మంజుల

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రపంచ విద్యార్థి దినోత్సవం జరిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల, పలువురు అధ్యాపకులు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కలాం పట్టుదల, కృషిని కొనియాడారు. కలాం జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని తమ ప్రతిభ పెంచుకోవాలని, భవిష్యత్ నాయకులుగా మారే దిశగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ కౌన్సిల్ కన్వీనర్ డాక్టర్ పీఎల్ శరణ్య, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. కిరణ్మయి, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు మీదే భవన నిర్మాణ సామగ్రి విక్రయాలు

- స్థానికుల అవస్థలు
- పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ అధికారులు

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గం పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో రోడ్ల మీదనే భవన నిర్మాణ సామగ్రి విక్రయాల దందా తీవ్ర దుమారం రేపుతోంది. ఇక్కడి 24వ వార్డు రేసపువానిపాలెం స్వర్ణభారతి స్టేడియం రోడ్డులో ఇసుక, పిక్క వంటి భవన నిర్మాణ సామగ్రి విక్రయాలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. ఇక్కడ రోడ్డు మీదే ఇసుక, కంకర పిక్క వంటి భవన నిర్మాణ సామగ్రి విక్రయాలు ఎన్నో సంవత్సరాల తరబడి జరుగుతున్నా జీవీఎంసీ జోన్-3 టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. రోడ్డు మీదనే భవన నిర్మాణ సామగ్రి విక్రయాల కారణంగా సమీపంలోని ఇళ్లలోకి రోజూ దుమ్ము, ధూళి వచ్చేస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఇక్కడ విక్రయాల కారణంగా పాదచారులు, వాహన చోదకులు కూడా ఇబ్బంది పడుతున్నారు. ఇక వర్షాలు పడితే చెప్పనవసరమే లేదు. రోడ్డంతా ఇసుక, బురదమయంగా తయారవుతుందని స్థానికులు వాపోతున్నారు. భవన నిర్మాణ సామగ్రి విక్రయాల సమయంలో వచ్చే గూడ్స్ ఆటోల కారణంగా ఈ మార్గం నిత్యం ట్రాఫిక్‌జామ్ అవుతోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అలాగే తరచూ ట్రాఫిక్ జామ్ అయి హారన్ల మోత మోగిస్తున్నారని వారు చెబుతున్నారు. క్వారీ లారీలలో ఇటుక, ఇసుక, పిక్క ఇక్కడ దిగుమతి చేసుకుని రోడ్డు మీదే డంపింగ్ చేస్తుంటారు. లూజు విక్రయాల కింద గూడ్స్ ఆటోల ద్వారా భవన నిర్మాణ సామగ్రి విక్రయాలు చేస్తుంటారు. క్వారీ లారీలు వచ్చినపుడు సంగతి చెప్పనక్కరలేదు. ఇక్కడి ప్రజలు ఇన్ని ఇబ్బందులు పడుతున్నా సమీపంలోని సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ కనీసం ఇటు వైపు రాకపోవడం తీవ్ర దుమారం రేపుతోంది. ఇప్పటికైనా జీవీఎంసీ జోన్-3 టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు స్పందించి ఇక్కడ రోడ్డుపై భవన నిర్మాణ సామగ్రి విక్రయాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డుపైనే విక్రయాలు చేస్తున్న భవన నిర్మాణ సామగ్రి

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

ఆశ్వీయుజ పౌర్ణమికి ఏర్పాట్లు పూర్తి

దాబాగార్డెన్స్: అన్నవరం సత్యదేవుడి అంతటి ప్రాధాన్యం గల ఇసుకకొండ (బాబాజీ కొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో ఆశ్వీయుజ పౌర్ణమికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం సర్వ దర్శనంతో పాటు రూ.20, రూ.200, రూ.300 టికెట్లు అందుబాటులో ఉంచారు. మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. జిల్లా నలుమూలల నుంచే కాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలి రానున్నారు. వేకువ జాము 4 గంటల నుంచే భక్తులు తరలి రానున్న దృష్ట్యా చర్యలు చేపట్టారు. వేకువ జాము 4 గంటలకు అనివెట్టి మండపం వద్ద సామూహిక వ్రతాలు, ప్రత్యేక పూజలు జరపనున్నారు. ధ్వజస్తంభ పూజలు జరగనున్నాయి. ఉదయం 7 నుంచి ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రాజగోపాల్‌రెడ్డి తెలిపారు.



ఇసుక కొండపై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి